

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 28.0



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

భీమవరం టౌన్/క్రైం, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహా పురుషుడు, సంక్షేమానికి, సినీ రంగానికి కొత్త బాటలు వేసిన సంఘసంస్కర్త మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ నాగరాణి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. జేసీ రాహల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్టీఆర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి కలెక్టర్, జేసీ తదితరులు నివాళులర్పించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను అధికారులు, విద్యార్థులు తిలకించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్ జయంతి వేడుకలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని కొనియాడారు. ఏఎస్పీ వి.భీమారావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ నయీం అస్మి

40 మంది సచివాలయ సిబ్బందికి నోటీసులు

నరసాపురం టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 40 మంది సచివాలయ సిబ్బందికి నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు. వలంధర్ రేవులో మంగళవారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి కొంతమంది సచివాలయ సిబ్బంది గైర్హాజరయ్యారు. జేసీ రాహల్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ముందుగానే ప్రకటించినా సిబ్బంది హాజరు కాకపోవడం, కనీసం ఏర్పాట్ల పర్యవేక్షణకు రాకపోవడంపై జేసీ సీరియస్ అయ్యారు. విచారించి నోటీసులు ఇవ్వాలని మంగళవారం ఆదేశించారు. దీనికి అనుగుణంగానే నోటీసులు జారీ చేయడం సచివాలయ ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది.



శృంగవృక్షంలో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

15 వరకు రేషన్ పంపిణీ

పాలకోడేరు, మే 28(ఆంధ్రజ్యోతి):పాలకోడేరు మండలం శృంగవృక్షంలో రేషన్ షాపు నెంబర్ 0537011ను జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జూన్ 1 నుంచి రేషన్ షాపుల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీ ప్రారంభం కానున్న నేపథ్యంలో శృంగవృక్షం రేషన్ షాపును జేసీ తనిఖీ చేశారు. జూన్ 1 నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులు వారికి అనుకూలమైన సమయంలో రేషన్ సరుకులు పొందవచ్చునని తెలిపారు. వికలాంగులకు, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులను అందజేయాలని డీలర్లను ఆదేశించారు. డీఎస్‌వో ఎన్.సరోజ, ఏఎస్‌వో ఎం.రవిశంకర్, సీఎస్‌డీటీ ఆదిశేషయ్య నాయుడు ఉన్నారు.



సీఎం చంద్రబాబుకు రూ.20 లక్షల చెక్‌ను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు కుమారుడు భరత్‌వర్మ



మహానాడులో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, చంద్రబాబుతో మంత్రి పార్థసారథి మాటామంతి







మహానాడులో ఆచంట ఎమ్మెల్యే పితాని, ఎండీ షరీఫ్.. తదితరులు



వంటలను రుచి చూస్తున్న రామరాజు.. ఎలా వున్నాయని ఆరా తీస్తున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి.., ఎమ్మెల్యే చింతమనేని సందడి



మహానాడులో పాత్తూరి, ఎమ్మెల్యే చంటి, టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని, వలవల తదితరులు

మహానాడు అదుర్స్

అప్పగించిన బాధ్యతల్లో మన మంత్రులు, ఎమ్మెల్యేల సక్సెస్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మహానాడులో గురువారం జరిగే బహిరంగ సభకు వేలాది మంది కార్యకర్తలు సొంత వాహనాల్లో బయలుదేరారు. రెండు రోజులుగా ప్రతినిధుల సభలో మూడున్నర వేల మందికి పైగా ఉమ్మడి పశ్చిమ నుంచి టీడీపీ తీర్మానాల చర్చల్లో పాలు పంచుకున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు తమకు అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు. తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నియోజకవర్గాల్లో కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా ప్రకటించడంతో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు, మిగతాచోట్ల అధికారులు దగ్గరుండి నిర్వహించారు. తెలుగుదేశం కార్యకర్తలు, నేతలంతా మహానాడులో కదం తొక్కారు. ఎమ్మెల్యేల సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత లోకేశ్, మిగతా సీనియర్లను కలిసేందుకు ప్రయత్నాలు చేశారు. మహానాడు విశేషా లను ఎప్పటికప్పుడు తమ నియోజకవర్గ ప్రజలకు చేరవేసేందుకు ప్రయత్నించారు. మంత్రి రామానాయుడు సభా వేదిక పర్యవేక్షణలో క్షణం తీరిక లేకుండా వ్యవహరించడమే కాకుండా సీఎం చంద్రబాబు ప్రశంసలు పొందారు. ఆహార కమిటీలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చురుగ్గా వ్యవహరించారు. ఎప్పటికప్పుడు అవసరాన్ని గుర్తించి ఆ మేరకే తగు ఏర్పాట్లు చేయగలిగారు. పార్టీ కోశాధికారి మెంటే పార్థసారథి పార్టీ ఆదాయం, ఖర్చులు వివరించడమే కాకుండా పార్టీ ఆర్థిక వ్యవహారాల చర్చల్లో పాల్గొన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పార్కింగ్ కమిటీలో చెమటోడ్చి పనిచేశారు.

సహకరించండి

- సహకార సంఘాలకు రూ.65 కోట్ల ధాన్యం కమీషన్ బకాయిలు పెండింగ్
- గత ప్రభుత్వ హయాం నుంచి విడుదల చేయని వైనం
- సొసైటీల ఎదురుచూపు.. నిధులు విడుదలతోనే ముందడుగు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రాథమిక సహకార సంఘాల విధులు పెరుగుతున్నాయి. సేవలను విస్తరిస్తున్నారు. పనిభారం అధికమవుతోంది. ఫలితం అంతంతమాత్రంగానే ఉంటోంది. ప్రయోజనం లేని విధులు నిర్వహిస్తున్నామన్న ఆందోళన సహకార సిబ్బందిలో నెలకొంది. ప్రభుత్వం నుంచి బకాయిలు విడుదల కాకపోవడంతో మరింత ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో సహకార వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైంది. ముఖ్యంగా ధాన్యం కొనుగోళ్లలో కమీషన్‌ను విడుదల చేయలేదు. ఇప్పటి వరకు జిల్లాలో 122 సహకార సంఘాలకు ప్రభుత్వం నుంచి రూ.65 కోట్ల బకాయిలు విడుదల కావాలి. వాటిని ప్రభుత్వం మంజూరుచేస్తే అన్ని సహకార సంఘాలు లాభాలబాట పట్టనున్నాయి. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కుతాయి. జిల్లాలో కొన్ని సంఘాలు మాత్రమే స్వయం సమృద్ధి సాధించాయి. విశాల పరపతి సంఘాలు ఆ జాబితాలో ఉన్నాయి. చిన్న సంఘాలకు చేయూత లేకుండాపోయింది. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించిన తర్వాత ఆర్థిక సమృద్ధి సాధించే దిశగా సహకార సంఘాలు పయనించాయి. ప్రభుత్వం ఇచ్చే కమీషన్‌తో వ్యాపారాలు చేసుకున్నాయి. రైతులకు రుణాలు ఇచ్చాయి. వడ్డీలు సంపాదించి ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కే ప్రయత్నం చేశాయి. అంతలోనే తదుపరి



కమీషన్ సొమ్ములను డీసీసీబీలో డిపాజిట్ చేశారు. దాదాపు రూ.100 కోట్లు మేర ఇప్పుడు డీసీసీబీ ఖాతాలో ఉన్నాయి. ఇది సహకార సంఘాలకు ఇబ్బందికరంగా మారింది. తమ సొమ్ములను డీసీసీబీ నుంచి ఇప్పించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. అయినా ఫలితం లేకపోయింది. తాజాగా జిల్లాలోని సహకార సంఘాలకు ప్రభుత్వం మరో రూ 65 కోట్లు బకాయిలు పడింది. పౌరసరఫరాల కార్పొరేషన్ ఆ మొత్తాన్ని విడుదల చేయాలి. గత ప్రభుత్వంలో బకాయిలు పేరుకుపోవడంతో సొసైటీలు అల్లాడిపోతున్నాయి.

సంఘాలపై అనుమానాలు

సహకార సంఘాలకు నిధులు ఇస్తే పక్కదారి పట్టిస్తున్నాయన్న అనుమానాలు వెంటాడుతున్నాయి. నిధులు దుర్వినియోగం చేసి సొంత ప్రయోజనాలకు సిబ్బంది వినియోగించుకుంటున్నారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటీవల ఇటువంటి ఆరోపణలను సొసైటీలు ఎదుర్కొంటున్నాయి. జిల్లాలో కొన్ని సొసైటీలు చేసిన తప్పిదాలతో సహకార వ్యవస్థ అంతా అభాసుపాలవుతోంది. వాస్తవానికి రైతులకు సేవలందించడంలో సొసైటీలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. రుణాలు అందించడం, ఎరువులను రుణ పద్ధతిలో విక్రయించడం, ధాన్యం కొనుగోళ్ల వంటి సేవల్లో ముందుంటున్నాయి.

పెరగనున్న విధులు

ప్రభుత్వం సొసైటీలకు మరిన్ని విధులను విక్రయించడానికి సిద్ధమవుతోంది. రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులను విక్రయించాలని వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిపాదన చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎరువులను విక్రయించారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు పక్కదారి పట్టాయి. నగదు ఇస్తేనే ఎరువులను విక్రయించేవారు. ఈ ఒక్క విధానం వల్ల రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ డీలర్లకు విక్రయించేవారు. రైతులు సొమ్ములు చెల్లించి రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సేవా కేంద్రాల్లో ఎరువుల విక్రయాన్ని నిలిపివేసింది. మళ్లీ అదే ప్రతిపాదనను వ్యవసాయ అధికారుల నుంచి వెళ్లింది. ఈసారి సహకార సంఘాల ద్వారానే రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను విక్రయించాలని ప్రభుత్వం భావిస్తోంది. వ్యవసాయ శాఖ, మార్క్‌ఫెడ్‌లు సంయుక్తంగా చర్చించాయి. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తే రైతు సేవా కేంద్రాల ద్వారా మళ్లీ ఎరువులను సరఫరా చేయనున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ప్రధానంగా సహకార సంఘాలపైనే ఆధారపడుతున్నారు. ఇటీవల కంప్యూటరీకరణ పూర్తికావడంతో బ్యాంకులు మాదిరిగానే పారదర్శకంగా సేవలందించడానికి సొసైటీలు ఉపయోగపడనున్నాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. ఇదే ఇప్పుడు సొసైటీలకు ఇబ్బందికరంగా మారింది.

'వాల్యుయేషన్' లోపాలు నిజమే

- ఆంధ్రజ్యోతి కథనంపై ఏలూరు డీఈవో వివరణ

ఏలూరు అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి):మూల్యాంకనం సిబ్బంది తప్పిదం/నిర్లక్ష్యం కారణంగా ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల్లో పలువురికి ఆయా సబ్జెక్టుల్లో మార్కులు తక్కువగా పడటమో లేదా విద్యార్థి రాసిన జవాబులను పూర్తిగా వాల్యూయేషన్ చేయకుండా వదిలేయడమో జరగడం వల్ల వాటిల్లిన నష్టంపై 'పిల్లల జీవితాలతో ఆటలా' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం నిజమేనని డీఈవో వెంకటలక్ష్మమ్మ అంగీకరించారు. ఈ మేరకు పత్రికా కథనంపై బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు. కథనంలోని వివరాలన్నీ సరిచూశామని, అవన్నీ నిజమేనని ధ్రువీకరిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సంబంధించిన ఏడు సబ్జెక్టుల జవాబు పత్రాలను రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో మూల్యాంకనం చేశారని వివరించారు. ఇలాంటి తప్పులు జరగకుండా అమరావతిలోని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయం తగిన జాగ్రత్తలు/చర్యలు తీసుకోవాలి. ఈ తప్పిదాలు ఏలూరు జిల్లాలో జరిగిన మూల్యాంకనంలో జరిగినవి కావని స్పష్టం చేశారు.



భీమవరంటౌన్, మే 28(ఆంధ్రజ్యోతి):రాజ్యసభ సభ్యుడిగా పాకా వెంకట సత్యనారాయణ న్యూఢిల్లీలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చక్రవర్తి వర్మ, సీనియర్ నాయకురాలు శరణాల మాలతీరాణి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కలిదిండి వినోద్‌వర్మ, ఉమ్మడి జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు తదితరులు అభినందించారు.

కొవిడ్ నిర్ధారణ!

- పైడిపర్రు మహిళతోపాటు ఏలూరు జిల్లాలో మరొకరికి..!



శానిటేషన్ చేస్తున్న సిబ్బంది

ఏలూరు అర్బన్/తణుకు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం పైడిపర్రుకు చెందిన మహిళకు కొవిడ్ నిర్ధారణ కాగా, ఏలూరు జిల్లాలో మరొకరికి పాజిటివ్ నిర్ధారణైంది. ముసునూరు మండలం ఎల్లాపురానికి చెందిన 52 ఏళ్ల వ్యక్తి కొవిడ్ లక్షణాలతో బుధవారం ప్రభుత్వాసుపత్రికి రాగా, వైద్య నిపుణుల సూచనల మేరకు టెస్టు నిర్వహించగా పాజిటివ్ వచ్చింది. ఈ వ్యక్తి ఆరోగ్యం నిలకడగానే ఉందని, స్థానికంగా హోం ఐసోలేషన్‌లో ఉన్నట్టు వైద్య వర్గాలు తెలిపాయి. కొవిడ్ పాజిటివ్‌తో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏలూరు శాంతినగర్‌కు చెందిన దంపతులిద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఐడీఎస్‌పీ విభాగం వైద్యాధికారులు వెల్లడించారు.

అలాగే తణుకు మండలం పైడిపర్రుకు చెందిన మహిళకు రాపిడ్ టెస్ట్‌లో కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. రాజమండ్రిలో చికిత్స పొందుతున్న ఆమెను బుధవారం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరోవైపు ఆ మహిళ నివాసం వద్ద మునిసిపల్ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. కేసు వివరాలను మున్సిపల్

(మిగతా 6వ పేజీలో)

కన్నీటి గోదారి

గోదావరిలో గల్లంతైన ముగ్గురు బాలుర మృతదేహాలు లభ్యం
కుటుంబాల్లో అంతులేని విషాదం

5



అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

పట్టణాల్లోని మహిళా సంఘాల సభ్యులు ఎదుర్కొంటున్న బ్యాంకు లింకేజీ సమస్యలు, కొత్త గ్రూపుల ఏర్పాటులో ఇబ్బందులు, పట్టణ ప్రజల జీవనోపాధి అవకాశాలు, వీధి వ్యాపారుల పథకాలు వంటి అంశాలపై సందేహాలు, సమస్యల పరిష్కారానికి మెప్మా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జి.హెబ్సిబా సమాధానం ఇవ్వనున్నారు. ఈ నెల 30వ తేదీ శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమంలో 94406 25154 నెంబరుకు ఫోన్‌చేసి సమస్యను తెలియజేయండి.

పసుపు జాతర


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం





రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహో ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..


మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు




నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజిలేస్తే...


కార్యకర్తల ఉత్సాహం..


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు

ద్వారకాతిరుమలలో పెళ్లి సందడి



ఆలయ ప్రాంగణంలోని మండపంలో జరుగుతున్న వివాహ శుభ కార్య వేడుక... శ్రీవారి క్షేత్రంలో భక్తుల క్యూ

ద్వారకాతిరుమల, మే 28(ఆంధ్రజ్యోతి): వివాహాలు చేసుకునేందుకు మంచి ముహూర్తం కావడంతో బుధవారం శ్రీవారి క్షేత్రం ఇందుకు వేదికైంది. ఈ జ్యేష్ట మాసంలో ఉన్న అతి తక్కువ ముహూర్తాల్లో ఇది తొలిముహూర్తం కావడంతో వివాహాది శుభకార్యాలు అనివేటి మండప ప్రాంతంలోను, ప్రైవేటు కల్యాణమండపాల్లో శాస్త్రోక్తంగా జరిగాయి. అన్నిక్రియలను జరిపించి శుభముహూర్త సమయంలో నూతన వధూవరులు మూడుముళ్లబంధంతో ఒక్కటైనారు. స్థానిక పాతకల్యాణమండప ప్రాంతంలోనూ ప్రైవేటు ఫంక్షన్ హాల్స్‌లోను వివాహాలు అధికంగా జరిగాయి. వివాహానికి కొన్ని వర్గాల్లో వరునికి ముందుగా జరిగే కాశీయాత్ర పక్రియ చూపరులను అలరించింది. కాళ్లకు పావుకోళ్ల, చేతిలో గొడుగు, కమండలం, దండంను ధరించిన వరడు కాశీయాత్రను బయలుదేరే ఘట్టం ఆకర్షణగా నిలిచింది. పెళ్లిళ్ల అనంతరం వారంతా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు.

నెలపొడుపు నాడు క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, మే 28(ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రానికి బుధవారం భక్తుల తాకిడి పెరిగింది. అమావాస్యనాడు మంగళవారం తగ్గిన భక్తుల రద్దీ జ్యేష్టమాసం నెలపొడుపు కావడంతో పాటు ఆలయ ప్రాంగణంలో వివాహాది శుభకార్యాలు జరడగడంతో విపరీతంగా పెరిగింది. దాదాపు పది వేల మంది పైబడి భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నట్లు ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి యాత్రికులు శ్రీవారిని దర్శించుకున్నారు.

ఆధునీకరించి మూసి వేశారు!

ఇది పెన్నాడ రైల్వే స్టేషన్ దుస్థితి.. ప్రయాణికుల అసహనం


పెన్నాడ రైల్వే స్టేషన్

పాలకోడేరు, మే 28 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయలతో అభివృద్ధి చేసిన పెన్నాడ రైల్వే స్టేషన్ మూతపడింది. స్టేషన్‌ను పునరద్ధరించాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్ని వినతులు అందించినా ఫలితం ఉండటం లేదు.

భీమవరం నుంచి నరసాపురం వెళ్ళే రైల్వే మార్గంలో పాలకోడేరు మండలం పెన్నాడ అగ్రహారంలో సుమారు 18 కోట్ల రూపాయల వ్యయంతో రైల్వే స్టేషన్‌ను అధునాతన సౌకర్యాలతో అభివృద్ధిపరిచారు. దీనిలో భాగంగా అతిపెద్ద ప్లాట్‌ఫామ్, రెండు ప్లాట్‌ఫారాలను కలుపుతూ వంతెన నిర్మాణం, లిఫ్ట్ సౌకర్యం, టిక్కెట్ కౌంటర్, రిజర్వేషన్ టిక్కెట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. కరోనా పేరు చెప్పి పెన్నాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు ఎక్కడం లేదంటూ రైల్వే అధికారులు ఆ స్టేషన్‌ను మే నెల 2023 నుంచి మూసివేశారు. ఈ గ్రామాన్ని ఆనుకుని భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (బైట్) కళాశాల, ఎఫ్‌సీఐ గొడౌన్‌తోపాటు సుమారు 40 వేలు జనాభా నివసించే ప్రాంతాలు ఈ స్టేషన్‌ను ఆనుకుని ఉన్నాయి. ఎంతో ఉపయోగకరమైన ఈ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసి నాలుగు లైన్లు ఏర్పాటు చేసి ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. అటువంటి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసిన కొంత కాలానికే మూసివేయడంతో అటుగా ప్రయాణం చేసే ప్రయాణికులు ఇదెక్కడి విడ్డూరమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రైల్వే స్టేషన్‌లో ఒక స్టేషన్ సూపరింటెండెంట్, నలుగురు స్టేషన్ మాస్టర్లు, 9 మంది పాయింట్‌మెన్స్‌లు నేటికీ పని చేస్తూనే ఉన్నారు. రైలు వెళ్ళినప్పుడు, వచ్చినప్పుడు సిగ్నల్స్ కంట్రోల్ చేయడం, తదితర కార్యకలాపాలను ఆ సిబ్బంది ప్రతిరోజు నిర్వహిస్తూనే ఉంటారు. ఈ గ్రామంలో గతంలో ఏడు పాసింజర్ రైళ్లు అటూ ఇటూ తిరుగుతూ ప్రయాణికులకు ఎంతో సురక్షితమైన ప్రయాణాలను అందించేవి. విద్యార్థులు ఈ రైలులోనే వచ్చి కళాశాలకు వెళుతుండేవారు.

వినతి పత్రాలు అందించిన గ్రామస్థులు

రైల్వే స్టేషన్‌ను పునరుద్ధరించాలంటూ కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతోపాటు ప్రజాప్రతినిధులకు, అధికారులకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గ్రామస్తులు, విద్యార్థులు పలు మార్లు వినతిపత్రాలను అందించారు. ఈ రైల్వే స్టేషన్‌లో రైళ్ళు ఆగే వరకు తమ పోరాటం సాగిస్తామని వారు చెబుతున్నారు.

అన్ని సౌకర్యాలు ఉన్నాయి


కునుకు రామకృష్ణ

పెన్నాడ అగ్రహారంలోని రైల్వే స్టేషన్‌కు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. సిబ్బంది ఉన్నారు. వారికి జీతాలు కొత్తగా ఇవ్వవలసిన అవసరం లేదు. ఎప్పటిలాగానే మా గ్రామంలో పాసింజర్ రైళ్లను ఆపే విధంగా ప్రభుత్వాలు చూడాలి.

కరోనా సాకుతో మూసివేశారు


రమేష్, పెన్నాడ

కరోనా సమయంలో అన్ని రైల్వే స్టేషన్‌లలో ప్రయాణికులు అంతంత మాత్రంగానే ఎక్కేవారు. కానీ పెన్నాడ రైల్వే స్టేషన్‌ను కరోనా సాకుతో ప్రయాణికులు ఎవరూ ఎక్కడం లేదనే సాకు చూపించి రైల్వే స్టేషన్‌ను రైల్వే అధికారులు మూసివేశారు. రైల్వే స్టేషన్‌ను మళ్ళీ పునరుద్ధరించాలి.

మరపురానిది 'మహానాడు'

1988లో మహానాడు ఏర్పాట్లు చేశా : మాజీ ఎంపీ చేగొండి వెంకటహరరామ జోగయ్య

పాలకొల్లు, మే 28(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచమంతా చాటిన మహనీయుడు నందమూరి తారకరామరావు అని మాజీ ఎంపీ చేగొండి వెంకట హరరామ జోగయ్య కొనియాడారు. ఇప్పుడు కడపలో జరుగుతున్న మహానాడు పండుగ సందర్భంగా ఆయన 1988లో విజయవాడలో జరిగిన మహానాడు వేడుకను ఈ సందర్భంగా గుర్తు చేసుకుని ఆంధ్రజ్యోతితో బుధవారం మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని ఆయన నివాసంలో 88నాటి మహానాడు ముచ్చట్లను వివరించారు. 88లో విజయవాడలో మహానాడు నిర్వహించేందుకు పరిశీలనకు వచ్చిన ఎన్టీఆర్ ముఖ్య నాయకులతో భేటీ అయిన సందర్భంలో చంద్రబాబునాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వర రావు ఇంకా పలువురు తక్కువ వ్యవదిలో ఇక్కడ ఏర్పాట్లు పూర్తి చేయలేమనీ, చేసినా మూడు రోజులు నిర్వహణ సాధ్యం కాదని అప్పటి సీఎం ఎన్టీర్‌కి చెప్పారని మౌనంగా ఆలకించిన ఎన్టీఆర్ తర్వాత తనను పిలిచి ఇక్కడ ఏర్పాట్లు బాధ్యతను నీకు అప్పగిస్తున్నాను. సమర్థవంతంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అప్పటికప్పుడు రూ.5 లక్షల నగదు అందజేసి ఆదేశించారని తెలిపారు. తాను వెంటనే తన మకాం తాత్కాలికంగా విజయవాడకు మార్చి ఏర్పాట్లలో నిమగ్నమయ్యానన్నారు. కేవలం 12 రోజులు వ్యవధిలో భారీ బహిరంగ సభా ప్రాంగణంలో అదనంగా వచ్చిన ప్రజలు తిలకించడానికి తాత్కాలికంగా ఏడు థియేటర్లను, అందులో స్క్రీన్‌లు ఏర్పాటు చేశామని ఆనాటి మూడు రోజులు పండుగ తాను మరువలేనన్నారు. మహానాడు జరిగిన రోజుల్లో ఎన్టీఆర్ తన ఇంట్లోనే భోజనం చేశారని నాలుగురోజులు పాటు తన భార్యనే స్వయంగా ఆహర పదార్థాలు వండి వడ్డించారన్నారు. ఆనాడు మహానాడు నిర్వహణ కార్యక్రమం తనకు అప్పగించడం ఎప్పటికీ మరువలేనని, ఆనందం వ్యక్తం చేశారు.



దివంగత ఎన్టీఆర్‌తో జోగయ్య (ఫైల్)

పోషకాల గని.. ఈతపండ్లు

గణపవరం, మే 28(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ఆహ్లాదకరమైన పచ్చని వాతావరణంలో స్వచ్ఛమైన గాలితో పాటు ప్రకృతి ప్రసాదించే పండ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. వేసవిలో లభించే పండ్లలో ఈతపండ్లను ఎటువంటి రసాయనాలు లేకుండా, కృత్రిమంగా మగ్గబెట్టకుండా విక్రయిస్తుంటారు. పోషకాల గనిగా పిలువబడే ఈ పండ్లను పేదవాని పండ్లుగా పిలుస్తుంటారు. వేసవి సీజన్‌లో జీవనోపాధిగా ఈతపండ్ల విక్రయాలను మహిళలు, యువకులు మలుచుకుంటున్నారు. వేసవి సెలవుల్లో పట్టణాలు, నగరాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన పిల్లలు ఈతపండ్లను ఇష్టంగా తింటుంటారు.

గ్రామాల్లో ఈతచెట్లు అధికం..

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ఈతచెట్లే దర్శనమిస్తాయి. నగర, పట్టణవాసులకు తెలియకపోయిన పచ్చని పొలాల వెంబడి వెళ్లి పిల్లలు ఈతచెట్లు ఎక్కి కాయలు కోసుకుని తింటుంటారు. గుత్తులుగుత్తులుగా కాసే కాయలతో బాటసారులను కనువిందు చేస్తుంటాయి. పంట పొలాల్లోనూ పుంతల్లోనూ, కాల్వగట్లపైన ఉండే ఈతచెట్లు నిండైన రూపంతో కనువిందు చేస్తాయి. ముఖ్యంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లాల్లోని పలు మండలాల నుంచి ఈతపండ్లు తీసుకొచ్చి ప్రధాన నగరాలతో పాటు గణపవరంలో విక్రయిస్తున్నారు. ఎండు ఖర్జూరం తరహాలోనే మంచి పోషకాలు, రుచితో ఉంటాయని ఆయుర్వేదనిపుణులు సూచిస్తున్నారు. ఈతచెట్టుపై పచ్చగా ఉన్న కాయలు పసుపు రంగులో మారిన వెంటనే వాటిని సంచులు, కుండల్లో ఎండుగడ్డితో మగ్గబెట్టి పండ్లుగా తయారు చేస్తారు. అవి మార్కెట్‌లో గ్లాసు సైజులను బట్టి రూ.10 నుంచి రూ.100 వరకు విక్రయిస్తుంటారు.


ఈత పండ్లు

ఈత పండ్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి



ఈత పండ్లు ఆరోగ్యానికి దివ్యఔషదం. ఈ పండ్లలో ఎన్నో పోషకగుణాలతో రోగనిరోధక శక్తిని పెంచుతాయి. రక్తప్రసరణ మెరుగు చేస్తాయి. ఐరన్, గ్లూకోజ్, సుక్రోజ్, ఫ్రక్టోజ్‌లు ఉంటాయి. కాల్షియం కూడా అధికంగా ఉండడంతో ఎముల పటుత్వానికి ఉపయోగం. సీ, బీ విటమిన్‌లు ఉంటాయి. ఫోలిక్ యాసిడ్ ఔషద గుణాలు.. మహిళలు, గర్భిణులకు రక్తహీనత నివారణకు ఉపయోగపడతాయి. గుండెపోటు, పక్షవాతం నివారిస్తుంది. ఆకలి పెరుగుతుంది. అలసట, నీరసం, మానసిక రుగ్మతల నుంచి రక్షిస్తుంది.

- కె.ప్రియాంక, ప్రభుత్వ వైద్యాధికారి, పిప్పర.

రేషన్ కార్డులకు గడువు మూడు రోజులే

పశ్చిమ జిల్లాలో ఇప్పటివరకు 22,496 దరఖాస్తుల స్వీకరణ

భీమవరంటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునే వారికి గడువు మూడు రోజులే ఉంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు 11 నెలల తరువాత కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు 22,496 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చాయి, వీటిలో కొత్తగా రేషన్‌కార్డులు కావాలనుకునేవారు 2,785 మంది జిల్లా వ్యాప్తంగా దరఖాస్తులు చేసుకున్నారు. అడ్రస్సుల మార్పుల కోసం 1,037, ఆధార్ యాడింగ్ కోసం 244, చేర్పుల కోసం 15,622, డిలీషన్స్ కోసం 709 దరఖాస్తులు వచ్చాయి.

దరఖాస్తుల పరిశీలన

గ్రామ సచివాలయాల ద్వారా వచ్చిన దరఖాస్తులు సంబంధిత వీఆర్‌వో లాగిన్‌కు రావడంతో వాటిలో అర్హతలను పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పేర్లు తొలగింపు, అడ్రస్సుల మార్పులు, తదితర దరఖాస్తులను పరిశీలన చేసి తహసీల్దార్లకు పంపిస్తున్నారు. ఇంకా మూడు రోజులు గడువు ఉండడంతో ఇంకా ఎన్ని దరఖాస్తులు వస్తాయో అనే దానిపై అంచనా వేసుకుంటున్నారు.

జూన్‌లో కొత్త కార్డులు

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకున్నవారిలో అర్హత సాధించిన వారికి వచ్చేనెలలో కార్డులు జారీ చేసే అవకాశం ఉంది. కార్డులు మంజూరైన వారికి జూలై నుంచి రేషన్ అందించనున్నట్లు చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన సమాచారం రావలసి ఉంది.


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన జడ్పీ సీఈవో భీమేశ్వర్, సిబ్బంది

'జడ్పీ'లో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

ఏలూరుసిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ కార్యాలయం ఏలూరులో బుధవారం ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి జడ్పీ సీఈవో కె.భీమేశ్వర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవోలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, రికార్డ్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్ సిబ్బంది పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నందున ఈ కార్యక్రమాన్ని జడ్పీ కార్యాలయంలో నిర్వహించారు. మహనీయుడు దివంగత ఎన్టీఆర్ అని జడ్పీ సీఈవో భీమేశ్వర్ పేర్కొన్నారు. పౌరాణిక పాత్రల ధారణలో ఎన్టీఆర్‌కు ఎవ్వరూ సాటిలేరని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు.


ఏపీ నిట్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతోనే మెరుగైన ఆరోగ్యం

తాడేపల్లిగూడెం అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): యోగాతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కె.హిమబిందు అన్నారు. జూన్ 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఏపీ నిట్‌లో యోగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా ప్రతీ ఒక్కరి జీవన శైలిలో భాగం కావాలన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, విద్యార్థులు క్రమం తప్పకుండా నిత్యం యోగా సాధన చేస్తే ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడంతో పాటు శారీరక, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం విద్యార్థులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ తాలారి రేష్మ, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రాజేష్, డాక్టర్ మూర్తి, సాస్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ప్రత్యేక కేటగిరీల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నూజివీడు టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల నాలుగు క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరీలలో ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లు పొందే విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని బుధవారం నూజివీడులో నిర్వహించారు. నూజివీడు, ఆర్కే వ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో ప్రత్యేక కేటగిరిల్లో ప్రవేశాలకు సంబంధించి మొత్తం 473 మందికి కాల్ లెటర్లు పరంగా 346 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. స్పోర్ట్స్ కోటాలో 320 మందికి కాల్ లెటర్లు పంపగా 227 మంది, క్యాప్ కోటాలో 153 మందికి కాల్ లెటర్లు పంపగా 119 మంది అభ్యర్థులు హాజరైనట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. కార్యక్రమాన్ని అసిస్టెంట్ రిజిస్ట్రార్ అర్జున్‌రావు, ప్రొఫెసర్ గోపాలరాజు, ఏవో బండి ప్రసాద్, తదితరులు పర్యవేక్షించారు.

యానాం మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

» రూ.25 వేల విలువైన మద్యం, రూ.లక్ష విలువైన కారు స్వాధీనం

పెనుగొండ, మే 28(ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం దొంగరావిపాలెం వద్ద మంగళవారం రాత్రి అక్రమంగా యానా మద్యం రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 98 బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు తణుకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దొంగరావిపాలెంలో వాహనాలు తనిఖీలు చేయగా పట్టుబడినట్టు తెలిపారు. పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతం యానాం నుంచి ఇరగవరం మండలం కంతేరుకు చెందిన కొవ్వూరి వెంకట శ్రీనివాసరెడ్డి తాడేపల్లిగూడెంకు చెందిన గుత్తుల శ్రీనివాసరావుకు సరఫరా చేయడానికి తీసుకెళుతుండగా పట్టుకున్నారు. యానంలోని లక్ష్మి వైన్స్ నుంచి కాపగంటి సుమన్ మద్యాన్ని శ్రీనివాసరెడ్డికి విక్రయించినట్లు విచారణలో తేలిందన్నారు. శ్రీనివాసరెడ్డిని, గుత్తుల శ్రీనివాసరావులను అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి రూ.25వేలు విలువ చేసే 66లీటర్ల మద్యం, రూ.లక్ష విలువ చేసే కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐలు ఆర్.మధుబాబు, బి.లక్ష్మి, హెచ్‌సీ శ్రీనివాసరావు, వై.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్టు

» ఏడు బైక్‌లు స్వాధీనం

కృత్తివెన్ను, మే 28: చిన్నతనంలోనే చెడు వ్యసనాలకు బానిసై బైక్‌లను దొంగలిస్తున్న ఓ యువకుడితో పాటు మరో మైనర్‌ను పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. కేసు వివరాలను సీఐ నాగేంద్రప్రసాద్ కృత్తివెన్ను పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండల పరిధిలోని పల్లెపాలెం వద్ద ఎస్‌ఐ పైడిబాబు తన సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, భీమవరం వైపు నుంచి నంబర్ ప్లేట్లు లేని రెండు బైక్‌లపై వస్తున్న ఇద్దరు.. అనుమానాస్పద రీతిలో కనిపించారు. వారిని విచారించగా ఓ వ్యక్తి భీమవరం మండలం యనమదుర్రు గ్రామానికి చెందిన విల్లూరి సుధీర్‌బాబుగా గుర్తించారు. మరో మైనర్ బాలుడితో కలిసి చెడు వ్యసనాలకు బానిసై కొంత కాలంగా బైక్‌లను దొంగలిస్తున్నారని విచారణలో తేలిందన్నారు. దొంగలించిన బైక్‌లను మండల పరిధిలోని పడతడిక వద్ద ముళ్లపొదల్లో దాచి ఉంచారని, వాటిని విక్రయించే క్రమంలో తమకు చిక్కారని తెలిపారు. వారి నుంచి ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నాలుగు కృత్తివెన్ను పోలీస్ స్టేషన్ పరిధిలోవి కాగా, రెండు బంటుమిల్లి స్టేషన్, మరొకటి భీమవరం రూరల్ స్టేషన్ పరిధిలో బైక్‌లుగా గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు వివరించారు.

నిమ్మ @ 10

» భారీగా పతనమైన నిమ్మ ధర » పెట్టుబడులు దక్కవని రైతుల ఆవేదన


మార్కెట్ యార్డులో వున్న నిమ్మకాయల రాశి

పెదవేగి, మే 28 (ఆంధ్రజ్యోతి): నిమ్మ ధర పతనమైంది. ఏడాదిన్నర కాలంగా రైతుల ఆశలకు అనుగుణంగా ఉన్న ధర పది రోజులుగా తగ్గుతూ ఇప్పుడు మరింత తగ్గింది. 2024 మార్చి నుంచి నిమ్మ ధర పెరుగుతూ అదే ఏడాది కిలో ధర సెంచరీ మార్క్‌ను దాటింది. అప్పటినుంచి కాస్త నిలకడగా కొనసాగుతూ ఈనెల వరకు కొంచెం అటూ ఇటుగా కిలో రూ.50 నుంచి రూ.70 పలికింది. అంతకుముందు ఏడాది వరకు గిట్టుబాటు ధరలేక అల్లాడిన రైతులు ఏడాదిన్నరగా కొంతమేర లాభపడ్డారు. ఈనెల ప్రారంభం నుంచి ధర పతనమవుతూ రావడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురం నిమ్మలకాయల మార్కెట్‌లో సోమవారం కిలో నిమ్మ రూ.15 నుంచి రూ.25ల మధ్య పలుకగా మంగళవారం మరింత దిగజారి కిలో రూ.10 నుంచి రూ.15కు పడిపోయింది. సాధారణంగా ఈనెలాఖరు వరకు నిమ్మకు మెరుగైన ధర ఉంటుంది. కానీ ఈ ఏడాది మేనెల ప్రారంభం నుంచి తగ్గుతూ ఇప్పుడు రూ.15లకు పడిపోవడంతో రైతులు దిగాలు చెందు తున్నారు. ధర తగ్గుదలకు వర్షాలు కురవడమేనని వ్యాపారులు చెబుతున్నారు.

శ్రమ కూడా దక్కేలా లేదు



ఒక్కసారిగా తగ్గిన ధర మా ఆశలను అడియాసలు చేసింది. పెట్టుబడి పక్కన పెడితే కీసం శ్రమకు తగిన పలితం కూడా దక్కదు. ఎరువులు, పురుగుల మందులు, కూలీలు.. ఇలా పెట్టుబడి చూస్తే చాంతాడంత ఉండగా రాబడి లేదు. ఈ ఏడాది అప్పులే మిగులుతాయి.

- మాదు రాట్నాలరావు
నిమ్మరైతు, లక్ష్మీపురం

ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలి



సాగు పెట్టుబడి భారీగా పెరగ్గా ధర తగ్గింది. కిలో కనీసం రూ.50 తగ్గకుండా ఉంటే లాభదాయకం. ప్రభుత్వం ఎరువులు, పురుగు మందులను రాయితీపై అందిస్తే రైతుకు మేలు జరుగుతుంది. ఉపాధి పథకంలో కూలీలు రైతుల పొలాల్లో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే మరింత వెసులుబాటుగా ఉంటుంది.

- మారగాని అమల వరప్రసాద్
నిమ్మ రైతు, లక్ష్మీపురం


పాలకొల్లులో తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్.. పెనుగొండలో తహసీల్దార్ అనితకుమారి.. ఆకివీడులో తహసీల్దార్ వెంకటేశ్వరరావు థియేటర్లను తనిఖీ చేస్తున్న దృశ్యాలు

సినిమా థియేటర్లలో తనిఖీలు

పశ్చిమ గోదావరి జిల్లాలోని థియేటర్లలో తహసీల్దార్లు, రెవెన్యూ అధికారుల పరిశీలన

పాలకొల్లుఅర్బన్/పెనుగొండ/ గణపవరం/నరసాపురం/ మొగల్తూరు/తణుకు/అత్తిలి/ఆకివీడు/తాడేపల్లిగూడెం రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు పట్టణాల్లో వున్న సినిమా థియేటర్లను ఆయా మండలాల తహసీ ల్దార్లు, రెవెన్యూ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. థియేటర్ల లైసెన్స్‌లు, ఫైర్, ఆర్‌అండ్‌బీ, ఇతర డిపార్టుమెంట్లు ఇచ్చిన అనుమతులు, ఫిల్మ్ డివిజన్ సర్టిఫికెట్లు, శానిటరీ, ఫైర్ బక్కెట్లు, టికెట్ల ధరలు, సినిమా హాల్స్‌లో తినుబండారాలు, డ్రింకుల ధరలు, టాయ్‌లెట్ల పరిస్థితులను పరిశీలించారు. పాలకొల్లు పట్టణంలోని మారుతి, అడబాల 12, గీతా అన్నపూర్ణ థియేటర్లను తహసీల్దార్ యడ్ల దుర్గాకిశోర్ తనిఖీ చేసి అన్నీ సక్రమంగానే ఉన్నాయన్నారు. పెనుగొండ మండలం పెనుగొండలోని థియేటర్‌ను తహసీల్దార్ జి. అనితకుమారి తనిఖీ చేసి టికెట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గణపవరం మండలం గణపవరంలోని సినిమా థియేటర్లలో ఆర్‌ఐ గోపికృష్ణ, రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. కుమారి థియేటర్‌లో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరాయని, సీట్లు కొంచెం అసౌకర్యంగా ఉన్నాయన్నారు. నరసాపురం పట్టణంలోని అన్నపూర్ణ, రాజరాజేశ్వరి థియేటర్లలో తహసీల్దార్ ఐవీ సత్యనారాయణ, ఆర్‌ఐ మిరియాల లక్ష్మీనారాయణ తనిఖీలు చేశారు. మొగల్తూరు మండలం మొగల్తూరులోని చెరుకూరి థియేటర్‌ను తహసీల్దార్ రాజ్‌కిశోర్, తణుకు పట్టణంలో తహసీల్దార్ డీవీ ఎస్ఎస్ అశోక్‌వర్మ, మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ బృందం థియేటర్లలో తనిఖీ చేశారు. అత్తిలి మండలం అత్తిలిలో గల రెండు థియేటర్లను తహసీ ల్దార్ దశిక వంశీ తనిఖీ చేశారు. ఆకివీడు పట్టణంలోని గంగారత్న, విజయ్ థియేటర్లను తహసీల్దార్ నందూరి వెంకటేశ్వర రావు తనిఖీ చేశారు. థియేటర్లలో శానిటేషన్ అధ్వానంగా ఉందన్నారు. సీట్లు, క్యాంటీన్‌లో తినుబండారాలు, సైకిల్ స్టాండ్‌లు సక్రమం గానే ఉన్నాయన్నారు. తాడేపల్లిగూడెం థియేటర్లలో తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. పలు థియేటర్లలో వున్న సమస్యలను ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తామని ఆయా మండలాల అధికారులు తెలిపారు.

కొంతమంది బడా నిర్మాతల వల్లే నష్టం



సినీ పరిశ్రమలో కొంత మంది బడా నిర్మాల వల్ల థియేటర్ల యాజమాన్యం నష్టపోతుంది. ఆ నిర్మాతలు రాష్ట్రంలో థియేటర్లు లీజుకు తీసుకుని వాళ్ల ఆధీనంలో పెట్టుకుని పవన్ కల్యాణ్ సినిమా విడుదల సమయంలో రాద్ధాంతం చేస్తున్నారు. క్యాంటీన్లకు కూడా వాళ్లే మేనేజ్ చేస్తూ తినుబండారాలు, టిక్కెట్లు అధిక ధరలకు విక్రయాలు చేస్తుండడంతో ప్రజల చేబులకు చిల్లుపడుతున్నాయి. మెయిన్ హీరోల సినిమాలతో పాటు పవన్ సినిమా విడుదల సమయంలో థియేటర్లకు పర్సంటేజ్‌లతో బాగుపడుపోతారనే ఉద్దేశంతో టిక్కెట్లు ధరల దగ్గర గొడవలు సృష్టిస్తున్నారు. థియేటర్లు బంద్ చేస్తే నెలకు కరంటు బిల్లులు, లేబర్ చార్జీలతో రూ.లక్షల్లో నష్టపోతున్నాం.

జీఎన్వీ సత్యనారాయణ, విజయ సినీ కాంప్లెక్స్ జనరల్ మేనేజర్, ఆకివీడు.

త్వరలో ఎంపీహెచ్‌ఏ (మేల్) ఉద్యోగులకు
వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 48 మండలాల పరిధిలో పనిచేస్తున్న ఎంపీహెచ్‌ఏ (మేల్) ఉద్యోగులను మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో తాత్కాలిక ప్రాతిపదికన సమీప ప్రాంతాల్లోనే వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై నియమించడానికి ఉద్దేశించిన కౌన్సెలింగ్ మార్గదర్శకాలను లిఖితపూర్వకంగా పంపించాలని సీఎఫ్‌డబ్ల్యూ కార్యాలయాన్ని డీఎంహెచ్‌వో ఆఫీసువర్గాలు కోరాయి. పని సర్దుబాటుపై నియమించేందుకు ఇటీవల 252మందితో కూడిన ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగుల సీనియార్టీ జాబితాను విడుదల చేసిన జిల్లా వైద్యఆరోగ్యశాఖ జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి, పరిష్కరించింది. తుది సీనియార్టీ జాబితాను విడుదల చేసి కౌన్సెలింగ్ చేపట్టడానికి సమాయత్తమవుతున్న దశలో ఉద్యోగుల నుంచి వేర్వేరుగా అభ్యంతరాలు, సూచనలు, అభ్యర్థనలు వచ్చాయి. ముఖ్యంగా ఉద్యోగి నియామకం జరిగిన తేదీ లేదా సర్వీసు క్రమబద్ధీకరణ తేదీలలో దేనిని కౌన్సెలింగ్ సీనియార్టీకి ప్రామాణికంగా తీసుకోవాలన్న దానిపై సందిగ్ధత ఏర్పడింది. వీటన్నింటినీ రాష్ట్ర అధికారుల ఎదుట ప్రస్తావించి వివరణను కోరారు. మౌఖికంగా రాష్ట్ర అధికారులు వివరణలు ఇవ్వడంతో వాటిని లిఖితపూర్వకంగా ఇవ్వాలని జిల్లా అధికారులు అభ్యర్థించగా, ఆ మేరకు కొద్దిరోజుల్లోనే వాటిని పంపుతామన్నారు. తాజాగా మార్గదర్శకాలు అందిన తర్వాత కొద్దిరోజుల్లోనే పని సర్దుబాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో కార్యాలయవర్గాలు తెలిపాయి.


అడవిపాలెంలో బోల్తాపడిన ట్రాక్టర్

లారీ ఢీకొని
తిరగబడిన ట్రాక్టర్

యలమంచిలి, మే 28(ఆంధ్రజ్యోతి): అడవిపాలెం గ్రామంలో ప్రధానరహదారి పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఇసుకలోడుతో వెళుతున్న టిప్పర్ లారీ ఢీకొట్టడంతో ట్రాక్టర్ తిరగబడింది. ట్రాక్టర్‌పై ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఆ సమయంలో అటుగా రాకపోకలు సాగిస్తున్న వారు, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. మట్టి, ఇసుక లోడుతో వెళుతున్న లారీలు మితిమీరిన వేగంతో వెళుతున్నాయని.. రోడ్డుపైకి వెళితే ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనన్న భయం కలుగుతుందని పలువురు గ్రామస్థులు వాపోతున్నారు.

క్రైం సమాచారం

రైలు నుంచి జారిపడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు ఒక వ్యక్తి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఒడిశా రాష్ట్రం కందుజాహార్‌కు చెందిన రాబి ముండా(41) తన కుమారుడితో కలిసి కేరళ రాష్ట్రంలోని అలువ నుంచి భువనేశ్వర్‌కు రైలులో వెళుతున్నారు. మార్గమధ్యలో ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు రైల్వే గేటు వద్ద ప్రమాదవశాత్తు రాబి ముండా జారిపడి మృతి చెందాడు. ఈ సమాచారం రైల్వే ఎస్‌ఐ పి.సైమన్‌కు అందడంతో తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): ఒక గుర్తుతెలియని వృద్ధుడు రైలుపట్టాల వద్దకు వెళ్లడంతో ప్రమాదవశాత్తు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు గన్‌బజార్ సెంటర్ దగ్గరలో ఉన్న రైలు పట్టాల వద్దకు సుమారు 60 ఏళ్ల వయస్సు గల ఒక గుర్తు తెలియని వ్యక్తి బుధవారం బహిర్భూమికి వెళ్లారు. ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సుమారు 5.6 అడుగుల ఎత్తుకల్గి బట్టతల, తెల్లని జుట్టుతో, తెలుపు రంగు శరీరంతో ఉన్నాడు. సంఘటనా స్థలానికి రైల్వే ఎస్‌ఐ పి.సైమన్, తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఏకారణమో తెలియదు కాని ఒక యువకుడు పంది కొక్కులను సంహరించే గ్యాస్ బిళ్లలను మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండవల్లి మండలం లోకుమూడికి చెందిన అంబటి తంబి(24) దెందులూరు మండలం కొవ్వలి గ్రామ పరిధిలోని ఒక చేపల చెరువుపై పనిచేస్తున్నాడు. అతడికి వివాహం కాలేదు. చేపల చెరువుల గట్లపై పందికొక్కులను సంహరించడానికి పెట్టే గ్యాస్ బిళ్లలు మూడింటిని 27వ తేదీ రాత్రి మింగేశాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దెందులూరు పోలీసులు అనుమానాస్పద మృతిగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మోటారు సైక్లిస్టు మృతి

పెంటపాడు, మే 28(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం ముదునూరు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. తాడేపల్లిగూడెం రూరల్ మండలం అరుగొలనుకు చెందిన అడ్డగర్ల సాయిరమేష్(34) అనే వ్యక్తి ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం పని నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లి తిరిగి మోటారు సైకిల్‌పై అరుగొలను వస్తుండంగా ముదునూరు సమీపంలో భీమవరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేశామని ఎస్‌ఐ స్వామి తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

భీమవరం క్రైం, మే 28(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై కుమారుడితో కలిసి వెళ్తున్న మహిళ ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. వన్‌టౌన్ ఎస్‌ఐ కృష్ణాజీ తెలిపిన వివరాలివి.. వీరవాసరం మండలం పంజావేమవరానికి చెందిన కొండమంచిలి మోజెష్, అతని తల్లి మేరీ(35) కలిసి ఈనెల 24న భీమవరంలోని ఆసుపత్రికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా లారీ ఢీకొంది. మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ఆమె మృతి చెందిందని ఎస్‌ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోదావరిలో బాలుర మృతదేహాలు లభ్యం

» రాజోలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం » కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు


కేతా ప్రవీణ్, పాల్‌కుమార్, సూర్యతేజ మృతదేహాలు.. గోదావరిలో గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

ఆచంట, మే 28(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం అయోధ్యలంక శివారు రావిలంక గోదావరిలో మంగళవారం సాయంత్రం స్నానానికి దిగిన ముగ్గురు బాలురు గల్లంతు కాగా బుధవారం ఉదయం లభ్యమయ్యాయి. ఈ ఘటనలో నాగుళ్లలంకకు చెందిన కేతా ప్రవీణ్(15), సానబోయిన సూర్య తేజ (12), పెదలంకకు చెందిన నీడిపూడి పాల్ కుమార్(15) మృతి చెందారు. ఈ ఘటనలో మరో ఇద్దరు బాలురు క్షేమంగా బయటపడ్డారు. గల్లంతైన బాలురు కోసం అధికారులు గోదావరిలో తెల్లవార్లు ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలించారు. బుధవారం ఉదయం సుమారు ఆరున్నర ప్రాంతంలో కేతా ప్రవీణ్ మృతదేహం లభ్యం కాగా అనంతరం సానబోయిన సూర్య తేజ మృతదేహం లభ్యమైంది. పదకొండు గంటల సమయంలో కనకాయలంక సమీపంలో నీతిపూడి పాల్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. బాలురు మృతదేహాలకు కోనసీమ జిల్లా రాజోలు ప్రభుత్వ సామాజిక ఆరోగ్యకేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం వారి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అందజేశారు. బాలుర మృతదేహాలు లభ్యమయ్యే వరకు ఆచంట, గన్నవరం ఎస్‌ఐలు కె.వెంకటరమణ, శివ కృష్ణ, తహసీల్దార్‌లు జి.కనకరాజు, శ్రీపల్లవి పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను గోదావరి నుంచి తీసుకొచ్చే సమయంలో ఆయా కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా రోధించారు. ఈ ఘటనతో నాగుల్లంకలోని , పెదలంకలోనూ విషాదచాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఘటన తనను ఎంతో బాధించిందన్నారు. బాలుర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

ఉసురు తీసిన అప్పు..

» ప్రైవేట్ ఫైనాన్షియర్ ఒత్తిడితో ఒకరి ఆత్మహత్య


భాస్కరరావు (ఫైల్)

పెదవేగి, మే 28(ఆంధ్రజ్యోతి) : ఇంటి నిర్మాణం కోసం తీసుకున్న అప్పు కుటుంబ యజమాని ఉసురు తీసింది. వాయిదా సొమ్ము వసూలుకు ఫైనాన్స్ సంస్థ చేసిన ఒత్తిడికి ఒక వ్యక్తి అసువులు బాసాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. పెదవేగి మండలం కె.కన్నాపురానికి చెందిన కమ్మిలి భాస్కరరావు (35), మనీషా దంపతులకు 3, 4 ఏళ్ల వయస్సు ఉన్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. దంపతులు ఇద్దరూ వ్యవసాయ కూలీలే. సొంతస్థలంలో పూరింట్లో నివాసం ఉంటూ.. సొంతిల్లు నిర్మించుకోవాలనుకున్నారు. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు వచ్చి, ఇంటి నిర్మాణానికి అప్పు ఇస్తామని చెప్పడంతో వారి దగ్గర ఎనిమిది నెలల కిందట రూ.4లక్షలు అప్పు తీసుకుని ఇంటిని నిర్మించుకున్నారు. నెలకు రూ.12వేలు వాయిదా సొమ్ము చెల్లించాలని చెప్పి, రూ.4లక్షలు ఇచ్చారు. క్రమం తప్పకుండా ఏడు నెలల వాయిదాలు సకాలంలో చెల్లించారు. ఈనెల మొదట్లో 8వ నెల వాయిదా సొమ్ము చెల్లించాల్సి ఉంది. నగదు సమకూరకపోవడంతో వాయిదా సొమ్ము కట్టలేకపోయారు. దీంతో ఏలూరుకు చెందిన ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు మంగళవారం కె.కన్నాపురం ఇంటికి వచ్చి వాయిదా సొమ్ము కట్టనందుకు దురుసుగా ప్రవర్తించారు. వచ్చే నెలలో మొత్తం కట్టేస్తామని ప్రాధేయపడినా వారు వినకుండా గట్టిగా నిలదీశారు. దీంతో మనస్తాపానికి గురైన కమ్మిలి భాస్కరరావు మంగళవారం సాయంత్రం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు రాత్రంతా వెతికినా కనిపించలేదు. బుధవారం ఉదయం గ్రామం సమీపంలోని కోకో తోటలో చెట్టుకు ఉరివేసుకుని విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. దీనిపై మృతుడి భార్య మనీషా ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపారు. మృతుని తండ్రి, సోదరుడు ఇద్దరూ కూడా గతంలోనే మరణించారు. భాస్కరరావు భార్య, పిల్లలతోపాటు తల్లికూడా అతడిపైనే ఆధారపడి ఉన్నారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

» చించినాడ బ్రిడ్జిపై బైక్, సెల్‌ఫోన్ గుర్తింపు

యలమంచిలి, మే 28(ఆంధ్రజ్యోతి): భీమవరం మండలం తాడేరుకు చెందిన యువకుడు షేక్ లాల్‌మహ్మద్ మంగళవారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన లాల్‌మహ్మద్ మంగళవారం సాయంత్రం తన ఇంటినుంచి బయటకు వెళ్లాడు. సుమారు ఏడు గంటల సమయంలో అతడి కుటుంబసభ్యులు ఫోన్ చేయగా యువకుడి ఫోన్ లిఫ్ట్ చేసిన వ్యక్తి సెల్‌ఫోన్, బైక్ చించినాడ బ్రిడ్జిపై ఉన్నాయని చెప్పాడు. వెంటనే అతడి కుటుంబసభ్యులు చించినాడ బ్రిడ్జిపైకి చేరుకుని అక్కడ ఉన్న బైక్ యువకుడిదేనని గుర్తించి చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో అతడి తండ్రి బావాలిషా పోలీసులకు ఫిర్యాదుచేశారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదావరిలో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదని ఎస్‌ఐ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రవిచంద్ర

గొలుసు తస్కరించిన ముగ్గురి అరెస్ట్

జంగారెడ్డిగూడెం,మే 28 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలోని అయ్యన్న కాలనీలో ఉంటున్న కుందా జానకీదేవి కళ్లల్లో కారం కొట్టి ఆమె మెడలో మంగళసూత్రాలు తస్కరించిన ఘటనలో నేరానికి పాల్పడిన ముగ్గురు యువకులను అరెస్ట్ చేశామని డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. బుధవారం జంగారెడ్డిగూడెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 23న స్థానిక అయ్యన్న కాలనీలో నివాసముంటున్న రిటైర్డ్ టీచర్లైన కుందా శ్రీరామశాస్త్రి, జానకీదేవి ఇంటికి తాపీపని నిమిత్తం వచ్చిన ముగ్గురు యువకులు ఇంటి యజమాని బయటకు వెళ్లిన సమయంలో యజమానురాలు జానకీదేవి కళ్లల్లో కారం కొట్టి మెడలో బంగారు మంగళసూత్రాల తాడు దొంగతం చేసి పారిపోయిన సంగతి తెలిసిందే. ఈ కేసులోని ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి చోరీ సొత్తు బంగారు మంగళసూత్రం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై ఇంతకు ముందు నేర చరిత్ర లేదన్నారు. వీరిపై చార్జిషీట్ ఓపెన్ చేసి కదలికలపై నిఘా పెడతామని, నేరస్తులను రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. సీఐ కృష్ణబాబు, ఎస్‌ఐ ఎస్కే జబీర్, ఏఎస్‌ఐ సంపత్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం

భీమవరం టౌన్,మే 28 (ఆంధ్రజ్యోతి): భీమవరం డిపో పరిధిలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందకు చర్యలు తీసుకుంటామని భీమవరం డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తి తెలిపారు. బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎంలో ప్రయాణికుల నుంచి సమస్యలను, సలహాలను స్వీకరించి వారికి సమాధానాలు చెప్పారు. భీమవరం నుంచి గణపవరం మీదుగా విశాఖకు బస్సు నడపాలని భీమవరానికి చెందిన డి. రామలింగరాజు కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

మానవత ఉచిత దంత వైద్యశిబిరం

తాడేపల్లిగూడెం రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మానవత ఆధ్వర్యంలో బుధవారం పడాల వృద్ధాశ్రమంలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. వారికి ఉచితంగా టూత్ బ్రెష్‌లు, పేస్ట్‌లు, బిస్కెట్ ప్యాకెట్‌లు అందించారు. మానవత అధ్యక్షులు పత్సా వెంకటేశ్వరరావు, కార్యదర్శి యర్రా అంజనేయ స్వామి, యెగ్గిన శరత్ తదితరులు పాల్గొన్నారు.



తణుకు మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ నివాళి



ప్రత్తిపాడులో ఎన్టీఆర్‌కు ఘన నివాళి



పాలకొల్లులో టీడీపీ శ్రేణుల నివాళి



నరసాపురంలో కేక్ కట్ చేసి సంబరాలు



భీమవరంలో ఎమ్మెల్యే అంజిబాబు చీరల పంపిణీ

తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

» జయంతి వేడుకల్లో వక్తలు » కేక్‌లు కట్‌చేసి మిఠాయిల పంపిణీ » పలు సేవా కార్యక్రమాలు

భీమవరంటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారి ఆత్మ గౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. టీడీపీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా బుధవారం భీమవరం వీరమ్మ పార్కు వద్ద పార్టీ సీనియర్ నాయకులు మద్దుల రాము ఆధ్వర్యంలో 150 మంది పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు వారి ఆరాధ్య దైవం ఎన్టీఆర్ అని జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. వీరమ్మ పార్కువద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూల మా లలు వేసి నివాళిలర్పించి మాట్లాడారు. ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్ రావి రాంబాబు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు, మద్దుల రాము తదితరులు పాల్గొన్నారు. భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు నందమూరి యువసేన జిల్లా అధ్యక్షుడు చిరుకూరి రామకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.

తణుకు: ఎన్టీఆర్ ముఖ్య మంత్రిగా ఉన్న హయాంలోనే పేదలకు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళుర్పించారు. పురుషుల గ్రంథాలయంలో వావిలాల సరళాదేవి ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలగర వెంకటకృష్ణ, పరిమి వెంకన్నబాబు, వావిలాల సరళాదేవి, తాతపూడి మారుతీరావు, తమరాపు సత్యనారాయణ, నల్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు రూరల్: వేల్పూరులోని ఎన్టీఆర్ విగ్రహానికి ఏఎంసీ వైస్ చైర్మన్ వల్లూరి రామ్మోహన్, సర్పంచ్ వి కృష్ణవేణి, మాజీ ఉప సర్పంచ్ రెడ్డి నరేంద్ర ప్రసాద్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి కేశవరావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దువ్వ లో పార్టీ గ్రామ అధ్యక్షుడు శిరిగిశెట్టి వెంకటేశ్వరరావు, నీటి అధ్యక్షుడు మైపాల నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు అరిగెల బాబీ, మాజీ జడ్పీటీసీ కట్టా సూర్యారావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండపాకలో టీడీపీ నాయకుడు ఆత్మకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో, తేతలి లో పార్టీ గ్రామ అధ్యక్షుడు అడ్డాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో, ముద్దాపురంలో మాజీ సర్పంచ్ ముళ్లపూడి శ్రీనివాసరావు, కోనాలలో మాజీ సర్పంచ్ బూరుగుపల్లి ఆనంద రమేష్ నివాళులర్పించారు.

పెంటపాడు: ప్రత్తిపాడులో మాజీ ఎంపీటీసీ, టీడీపీ నాయకుడు వీర్ల కృష్ణ ఆధ్వర్యంలో కాగులంపాడు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుల అర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇన్‌చార్జి తహసీల్దార్ సీతారత్నం, పడమరవిప్పర్రులో పసల అచ్యుతం, ఉమామహేశ్వరంలో కొండ్రెడ్డి హైమవతి ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం పట్టణంలోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శేషమహల్ సెంటర్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు కేకు కట్ చేశారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, వర్తనపల్లి కాశి, సుభద్ర, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని ప్రపంచం నలుమూలలా చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నివాళులర్పించారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం బస్టాండ్ ఆవరణలో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. నాయకులు వీర్ల సత్యనారాయణ, కళ్యాణం రామచంద్రరావు పాల్గొన్నారు. ఆరుగొలనులో వట్టూరి రాంబాబు, మలకా వెంకట్రావు, అడపా వెంకన్నబాబు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మాధవరంలో మాజీ సర్పంచ్ కౌలూరి పరిమళ, నాయకులు బాలంకృష్ణ, ఎస్ గంగరాజు తదితరులు నివాళులర్పించారు. కుంచనపల్లి, మాధవరం, నవాబుపాలెం, కృష్ణాయపాలెం, నందమూరు, చినతాడేపల్లి తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అత్తిలి: పేదల గుండెల్లో ఎన్టీఆర్ నిలిచారని మాజీ ఎంపీపీ సత్యనారాయణ అన్నారు. అత్తిలి పార్టీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి అన్నదానం చేశారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ పాలమరశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం: మండలంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాల్లో చిత్రపటాలకు, విగ్రహాలకు ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇరగవరం, రేలంగి, కె ఇల్లిందలపర్రు, అయితంపూడి తదితర గ్రామ కూడళ్ళలో కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

పాలకొల్లు అర్బన్: టీడీపీ నాయకులు గాంధీ బొమ్మల సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. వల్లభు శ్రీనివాస్, తమ్మినీడి సత్యనారాయణ రావు, కొరగింజల రవి శంకర్, గాదె చిన వెంకన్న, చోడిశెట్టి జ్ఞాన శంకర్ తదితరులు పాల్గొన్నారు. నందమూరి అభిమాన సంఘం నాయకులు షేక్ శిలార్ తదితరులు ఎన్టీఆర్‌కు ఘన నివాళుల ర్పించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ వి శాంత కుమారి ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాలర్పించారు. వేసవి శిక్షణా తరగతుల్లో చిత్రలేఖనంలో శిక్షణ పొందిన 7వ తరగతి విద్యార్థి పి సత్యపవన్ కుమార్ ఎన్‌టీఆర్ చిత్రాన్ని గీసి ప్రదర్శిం చడంతో పలువురు ఆ విద్యార్థిని అభినందించారు.

పాలకొల్లు రూరల్: లంకలకోడేరులో టీడీపీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెక్కంటి ఆదినారాయణ, పెన్మెత్స సత్యనారాయణరాజు, చొప్పల కుటుంబరావు, ఆకుల బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.

ఆచంట: ఆచంటలో ఎన్టీఆర్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు గొడవర్తి శ్రీరాములు, తమ్మినీడి ప్రసాద్, మన్నె రాధిక, చిలుకూరి సీతారామ్, మానేపల్లి సత్యనారాయణ, కేతా మురళి, తమ్మినీడి పృథ్వి, రాంబాబు తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు.

నరసాపురం రూరల్: సీతారాంపురంలో టీడీపీ సీనియర్ నాయకులు ఆకన సుబ్రమణ్యం ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. పట్టణంలో శివాలయం సెంటర్ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహానికి డాక్టర్ రాజ్యలక్ష్మి, ఆధికారి అనంతరామారావు, పొన్నాల నాగబాబు, భూపతి నరేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మొగల్తూరు: తెలుగుజాతి గౌరవాన్ని ప్రపంచమంతా చాటిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని పలువురు నివాళులర్పించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో త్రిశూలపాణి ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు.

పెనుగొండ: పెనుగొండలో సర్పంచ్ నక్కా శ్యామలా సోని అధ్యక్షతన ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వడలిలో ఉప్పలపాటి చంటి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పెనుగొండ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అనిత కుమారి ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుల ర్పించారు.

పోడూరు: జాతి రత్నం ఎన్టీఆర్ అని పాలకొల్లు డీసీ వైస్‌చైర్మెన్ దేవళ్ల శ్రీరామకోటి మోహన్ అన్నారు. మండలంలోని జిన్నూరు, కవిటం గ్రామాల్లో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి మోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెనుమంత్ర: తెలుగువారి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని నియోజవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మార్టేరు లో కేక్ కట్ చేసిన అనంతరం మాట్లాడారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీరామ దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెనుమంత్ర మండలంలో వాడవాడలా ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సయ్యద్ ఆలీ జిన్నా, నీటి సంఘం అధ్యక్షుడు గుడాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవికుమార్ ఎన్టీఆర్ నివాళులర్పించారు. డిప్యూటీ తహసీల్దార్ ఏలియమ్మ, వీఆర్వోలు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: భీమవరం పట్టణ పార్టీ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు అధ్యక్షతన భీమవరం టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు జరిగాయి. సుబ్రహ్మణ్యరాజు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. టీడీపీ రాష్ట్ర అంగన్‌వాడీ, డ్వాక్రా విభాగ ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, ప్రసంగించారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు మద్దుల రాము ఆధ్వర్యంలో స్థానిక బీవీ రాజు పార్క్ సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు.

ఆకివీడు: తెలుగుజాతి రత్నం ఎన్టీఆర్ అని పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు అన్నారు. పలు చోట్ల ఎన్టీఆర్ విగ్రహాలకు తెలుగు తమ్ముళ్లతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి పేదలకు దుప్పట్లు, పండ్లు అందజేశారు.

ఆకివీడు రూరల్: బడుగు, బలహీనవర్గాల ఆత్మబంధువు ఎన్టీఆర్ అని కళింగ కార్పొరేషన్ రాష్ట్రకమిటీ సభ్యుడు లంబాడి రామాంజనేయులు అన్నారు. పెదకాపవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళలర్పిం చారు. వృద్ధులు, రోగులకు దుప్పట్లు, పళ్ళు పంపిణీ చేశారు.

కాళ్ళ: పెద అమిరం, కాళ్ళ, దొడ్డనపూడి, ఆనందపురం, ఏలూరుపాడు, కోపల్లె, సీసలి, కోమటిగుంట, కలవపూడి తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల కేక్‌లు కట్ చేసి స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, జీవీ నాగేశ్వరరావు, జడ్పీటీసీ పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, కఠారి నరసింహరాజు, పెంటపాటి నాగేశ్వరరావు, వీరమల్లు సురేష్, మంతెన ఆంజనేయరాజు, ముదుండి రాజేష్, హాట్‌లైన్స్ బాబు, పన్నాసి అబ్బులు, అల్లూరి దొరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: పాలకోడేరు మండలంలో అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గొరగనమూడి గ్రామ సర్పంచ్ శివాజీరాజు వృద్ధులకు దుప్పట్లు పంచారు. పాలకోడేరులో కొత్తపల్లి నాగరాజు వేడుకలు జరిపారు.

గణపవరం: తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచ నలుమూలల చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు అన్నారు. గణపవరం ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. జనసేన మండల అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమారరాజు, గణపవరం మండల యువత అధ్యక్షుడు కాపారం చిన్న, అధికారులు వేడుకల్లో పాల్గొన్నారు.

సావర్కర్‌కు ఘన నివాళి

భీమవరంటౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య పోరాటంలో కఠిన కారాగార శిక్ష అనుభవించిన వీర సావర్కర్ గొప్ప దేశభక్తుడని స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబీకుడు దంతులూరి సత్యనారాయణ రాజు (మ్యాజిక్ స్టార్ బోస్) అన్నారు. క్విట్ ఇండియా స్తూపం వద్ద శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్వాతంత్ర్య ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించి అమరుడైన మహనీయుడు వినాయక్ దామోదర్ సావర్కర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కె సీతారామరాజు, నిర్వాహకులు రంగసాయి, కే సూర్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసి ఉద్యోగుల హర్షం

భీమవరం టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసిలో పనిచేస్తున్న కార్మికుల ఉద్యోగుల భద్రత కోసం గతంలో ప్రభుత్వం నిలుపుదల చేసిన సర్క్యులర్ 1/2019 తిరిగి కూటమి ప్రభుత్వం అమలులోకి తీసుకురావటంపై ఎన్ఎంయు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పి సోమరాజు హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసి గ్యారేజీ వద్ద బుధవారంనాడు నిర్వహించిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు, రాష్ట్ర అధ్యక్షుడు, పీవీ రమణారెడ్డి, కార్యదర్శి వై శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీకి జోనల్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు

తాడేపల్లిగూడెం రూరల్, మే28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత సర్క్యులర్ సాధించిన సందర్భంగా తాడేపల్లిగూడెం డిపోలో బుధవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. డిపో గ్యారేజి గేటు ముందు విజయోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకున్నారు. డిపో అధ్యక్షుడు ఎం. శరత్‌బాబు, కార్యదర్శి ఎ. రవికుమార్, జోనల్ ఉపాధ్యక్షులు ఎ నాగేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ భుజంగరావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

నరసాపురం రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేష్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం, బాల్య వివాహాల నిర్మూలనపై శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మైనార్టీ తీరకుండానే పిల్లల పెళ్లిళ్లు చేయడం చట్ట విరుద్ధమన్నారు. యుక్త వయస్సు వచ్చిన తరువాతే పెళ్లిళ్లు చేసే విధంగా తల్లితండ్రుల్ని చైతన్యపర్చాలన్నారు. సీడీపీవో ఊర్మిళ, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్

నరసాపురం టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ముందుగానే ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను సరఫరా చేసింది. వాటిని ఎంఈవో-2 జాన్ ప్రభాకర్ పరిశీలించారు. టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పుస్తకాలను భద్రపర్చారు. పట్టణ, మండలంలో మొత్తం 31వేల పుస్తకాలు అవసరం కావాల్సి ఉండగా తొలి విడతగా 14వేల పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. పెండింగ్ పుస్తకాలను స్కూళ్లు తెరిచే నాటికి విద్యార్థులకు అందిస్తామన్నారు.

ఖైదీలకు ఉచితంగా న్యాయ సహాయం

నరసాపురం టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైలును బుధవారం ఉమ్మడి జిల్లాల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్నప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముద్దాయిలు క్రమం తప్పకుండా కోర్టు వాయిదాలకు వస్తున్నారా? వైద్య సదుపాయం, కేసుల వివరాలు, ఆహార పదార్థాలు, కౌన్సెలింగ్ విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఆర్థిక స్థోమత లేని వారు న్యాయసేవ ద్వారా ఉచితంగా అందించే న్యాయ సహాయాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. జైలర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలు

నరసాపురం, మే 28(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు రుజువు అయితే స్కానింగ్ సెంటర్‌ను మూసివేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్డీవో దాసిరాజు అదేశించారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ డివిజన్ లెవల్ మల్టీ మెంబర్స్ అథారిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. లింగ నిర్ధారణ పాల్పడితే చట్టపరంగా 3ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ 50వేలు జరిమాన, వైద్యుల ధ్రువపత్రం రద్దు చేయడం జరుగుతుందన్నారు. కమిటీ కన్వీనర్ డాక్టర్ బి ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

2న తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

భీమవరం రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఇళ్ళ స్థలాలకు ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం. 23ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న తలపెట్టిన తహసీల్దార్ కార్యాలయం ముట్టడి ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారావు పిలుపునిచ్చారు.



మంత్రి నిమ్మలతో పాలకొల్లు నాయకులు



మహానాడులో నరసాపురం టీడీపీ నాయకులు



ఆచంట నుంచి వెళుతున్న పార్టీ శ్రేణులు



ఉండి నుంచి తరలివెళ్తున్న టీడీపీ నాయకులు

మహానాడులో మనవాళ్లు..



మహానాడులో రక్తదానం చేస్తున్న సత్తిబాబు

నరసాపురం టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): కడప మహానాడుకు టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కొవ్వలి నాయుడు ఫాలోవర్స్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కడపలో ఉన్న అమీన్‌పీర్ పెద్ద దర్గాను దర్శించుకున్నారు. మత్స్యకార సంఘాల సమాఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు, జక్కం శ్రీమన్నారాయణ, వాతాడి ఉమా, సంకు భాస్కర్, గుబ్బల నాగరాజు, మౌలాలీ, మల్లాడి మూర్తి పాల్గొన్నారు.

చంద్రబాబుకు ఆరిమిల్లి అభినందన

తణుకు: సీఎం చంద్రబాబునాయుడు టీడీపీ జాతీయ అధ్యక్షుడుగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందనలు తెలిపారు. బుధవారం కడపలో మహానాడు రెండో రోజు అత్యంత ఉత్సాహంగా జరిగిందని చెప్పారు. ఆహార కమిటీ బాధ్యుడిగా ఎలాంటి లోటు లేకుండా దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించినట్లు చెప్పారు. గురువారం జరిగే భారీరంగ సభను విజయవంతం చేసేలా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విచ్చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కడప మహానాడులో పట్టణానికి చెందిన కాలే సత్తిబాబు గురువారం రక్తదానం చేశారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ప్రశంసా పత్రం అందజేసినట్లు సత్తిబాబు చెప్పారు.

ఆచంట: కడపలో జరుగుతున్న మహానాడు సభకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆచంట నియోజకవర్గం నుంచి టీడీపీ శ్రేణులు వివిధ వాహనాల్లో తరలి వెళ్ళారు.

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడుతో కలిసి 2వ రోజు మహానాడు కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు పాల్గొని సందడి చేసారు. వీరిలో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేన రోజా రమణి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు జీవీ, బి శేఖర్ తదితరులు ఉన్నారు.

ఉండి: కడప మహానాడుకు బుధవారం ఉండి కలిదిండి అబ్బాయిరాజు పార్కు వద్ద నుంచి ఐదు కార్లులో సమారు 50 మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామకృష్ణరాజు తనయుడు భరత్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. మండల టీడీపీ అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, కాగిత బుజ్జి, కర్రిశ్రీను, దాసరి వెంకటకృష్ణ, సూరవరపు వెంకటాచార్యులు, సుబ్బారావు, ఉండ్రు ఇస్సాకు తదితరులు మహానాడుకు వెళ్లారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో గురువారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు. చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. అజెండాలోని అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించి పలు అభివృద్ధి పనుల్ని ఆమోదించనున్నట్లు తెలిపారు.

మంద కృష్ణమాదిగకు అభినందన

తణుకు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగకు పద్మశ్రీ పురస్కారం అందజేయడం పట్ల సమితి ఆధ్వర్యంలో బుధవారం తణుకు వీరభద్రపురంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీయస్ సీనియర్ నాయకుడు దూలపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సమితి నాయకుడు బయ్యారపు రాజేశ్వరరావు, మాజీ సర్పంచ్, టీడీపీ ఇన్‌చార్జి మల్లిపూడి ప్రసాద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తాటేటి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

31న ఎంఆర్‌పీఎస్ చలో వరంగల్

పాలకొల్లు అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పద్మశ్రీ స్వీకరించి ఈనెల 31వ తేదీన వరంగల్ వస్తున్న సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్ళాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పసుపులేటి చిన్నిబాబు, జిల్లా అధ్యక్షుడు వై. రత్నరాజు పిలుపునిచ్చారు. స్థానిక ఏఎంసీ ఆవరణలో బుధవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి పట్టణ అధ్యక్షుడు పసల బోసు అధ్యక్షత వహించారు.

మానసిక వైద్యశాలల సందర్శన

భీమవరం క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.రత్నప్రసాద్ బుధవారం స్థానికంగా ఉన్న వర్మ హాస్పిటల్స్ శాంతి, ప్రశాంతి మానసిక వైద్యశాలలను సందర్శించి రోగుల మానసిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

200 రోజులు పని కల్పించాలి

ఆచంట, మే 28(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలకు 200 రోజులు పని కల్పించాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కేతా గోపాలన్ అన్నారు. బుధవారం కొడమంచిలి తురకవాని మెరక వద్ద పనిచేస్తున్న కూలీల సమస్యలు తెలుసుకున్నారు.



నగదు అందిస్తున్న దాతలు

కాళ్లకూరు శ్రీవారి ఆలయంలో అన్నదానానికి విరాళాలు

కాళ్ళ, మే 28 (ఆంధ్రజ్యోతి): కాళ్ళకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభూ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నదాన భవనానికి భీమవరానికి చెందిన డాక్టర్ రాయసం నరేష్ - సుధ దంపతులు, కుమారులు సంజయ్, రుద్రాన్ష్‌లు రూ. 1,25,000లు, అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన రుద్రరాజు నిరంజన్ బాలాజీవర్మ- రమాదేవి దంపతులు రూ. 50 వేలు అన్నదాన భవన నిర్మాణానికి విరాళం అందించినట్లు ఈవో తెలిపారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రతిమతో సత్కరించారు.

కొవిడ్ నిర్ధారణ!

(3వ పేజీ తరువాయి)

కమిషనర్ టి.రామ్‌కుమార్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై తణుకు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ఎస్.డేనియల్‌రాజు మాట్లాడుతూ పైడిపర్రు మహిళకు కరోనా అనుమానంతో రాజమండ్రిలో పరీక్షలు జరిపారు. రాపిడ్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చింది. ఆర్టీపీసీఆర్ టెస్ట్ రిపోర్టును బట్టి కరోనా నిర్ధారణ జరుగుతుంది. పూర్తి వివరాలను వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు పంపించాం' అని తెలిపారు.

పేదల ఆకలి తీర్చటం గొప్ప సమాజ సేవ: అంజిబాబు

భీమవరంటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల ఆకలి తీర్చడం గొప్ప సమాజ సేవ అని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. వరల్డ్ హంగర్ డే సందర్భంగా భీమవరం మలబార్ గోల్డ్ ఆధ్వర్యంలో హంగర్ ఫ్రీ వరల్డ్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించి మాట్లాడారు. మలబార్ గ్రూప్ 2025-26 సంవత్సరంలో సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరించడానికి రూ.150 కోట్లు కేటాయించడం గొప్ప విశేషమని, భారతదేశం, జాంబియా దేశాల్లో ప్రతిరోజూ 70 వేలు భోజనాలు పంపిణీ చేస్తున్నారని, మలబార్ హంగర్ ఫ్రీ వరల్డ్ పథకంలో భాగంగా రూ. 2.50 కోట్ల భోజనాలు ఉచితంగా అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. భీమవరం స్టోర్ హెడ్ ఇంతియాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రోజుకు 4,100 భోజనాలు అందించాలనే లక్ష్యంతో మలబార్ హంగర్ ఫ్రీ వరల్డ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందన్నారు. అనంతరం హంగర్ ఫ్రీ వరల్డ్ వాహనాన్ని ఎమ్మెల్యే అంజిబాబు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, చెరుకువాడ రంగసాయి, దాయన చంద్రజి, కృష్ణ, నరసింహ, మలబార్ సిబ్బంది సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

భీమవరం క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జయంతిని భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ స్టేషన్‌లో అధికారులు ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ అధికారి డాక్టర్ ఆర్ఎస్ కుమరేశ్వరన్, అసిస్టెంట్ ఎక్సయిజ్ సూపరింటెండెంట్ ఆర్వి ప్రసాదరెడ్డి, సీఐలు కె.బలరామరాజు, కల్యాణ చక్రవర్తి, ఎస్ఐలు, ఆఫీసు సిబ్బంది, కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

యలమంచిలి ఎంపీపీగా ధనలక్ష్మి బాధ్యతల స్వీకారం

యలమంచిలి, మే 28 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి ఎంపీపీగా ఇనుకొండ ధనలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలోని ఎంపీపీ ఛాంబర్‌లో ధనలక్ష్మి దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, వైసీపీ మండల అధ్యక్షుడు ఉచ్చుల స్టాలిన్, మాజీ ఎంపీపీ రావూరి వెంకటరమణ, పొత్తూరి బుచ్చిరాజు, లక్ష్మీపాలెం, కాజతూర్పు సర్పంచులు గటిగంటి మహేష్, పాలంకి శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ జె.డి.వి.ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు, మండలపరిషత్తు కార్యాలయ సిబ్బంది ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రుతుక్రమంపై అవగాహన

తణుకు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): యుక్త వయస్సు బాలికలు రుతుక్రమంపై అవగాహనతో మెలగాలని వేల్పూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కేఆర్ఎం కిషోర్ చెప్పారు. బుధవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు పీహెచ్‌సీ వద్ద నిర్వహించిన రుతు క్రమ ఆరోగ్యం-పరిశుభ్రత దినోత్సవం కార్యకమంలో ఆయన మాట్లాడారు. రుతు క్రమం సమయంలో పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక ఇన్ఫెక్షన్‌లను నుంచి రక్షణ పొందుతారని చెప్పారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపిక

పెనుగొండ, మే 28(ఆంధ్రజ్యోతి): పెనుగొండలోని విశ్వతేజ కళాశాలలో వివిధ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో కళాశాల విద్యార్థులు 21 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పులిగడ్డ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కళాశాల ఆవరణలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు.